


APTEL/25/A5250

మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ నరేంద్ర

గుంటూరు సంపుటి -1 సంచిక -97 పేజీలు-4 మంగళవారం 25 ఆగస్టు 2026 వెల4/-

## తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

పవిత్రోత్సవాలతో మరింత వైభవంగా తిరుమల



వివరాలు 2వ పేజీలో

# ఢిల్లీకి మళ్ళీ కాక్రోచ్ కదలిక.



- ◆సెప్టెంబర్ 5 నుంచి మళ్లీ ఉద్యమం..
- ◆ఢిల్లీకి యువత కదలిక!
- ◆ఇండియా గేట్ నుంచి
- ◆పోలీసు ప్రధాన కార్యాలయం వరకు శాంతియుత మార్చ్..
- ◆ముందుండనున్న నీట్ బాధిత కుటుంబాలు

వివరాలు 2వ పేజీలో

హామీ ఇచ్చి వెనక్కి తగ్గితే.. ఉద్యమం ఆగదని యువత తేల్చిచెప్పింది. జూలైలో కేంద్రం ఇచ్చిన హామీలను నమ్మి ఆందోళనకు విరామమిచ్చిన 'కాక్‌రోచ్ జనతా పార్టీ'.. మాట నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ సెప్టెంబర్ 5న మళ్లీ ఢిల్లీ వీధుల్లోకి రానుంది. ఈసారి నినాదాల ముందు బాధిత కుటుంబాలు.. వారి వెనుక జెన్-జెడ్ యువత.. ఇండియా గేట్ నుంచి పోలీసు ప్రధాన కార్యాలయం వరకు శాంతియుత మార్చ్‌తో కేంద్రాన్ని నిలదీయనుంది. 'మా సహనాన్ని బలహీనతగా భావించొద్దు.. ఇచ్చిన మాట నిలబెట్టుకోండి' అంటూ మొదలయ్యే ఈ అడుగులు.. మరో దశ ఉద్యమానికి సంకేతంగా మారుతున్నాయి.




వివరాలు 2వ పేజీలో

## ఫుడ్ ప్రాసెసింగ్‌తో రైతు ఆదాయానికి విలువ

- ▸ఆంధ్రా పాప్‌కార్న్, అరకు కాఫీ, కోస్తా కోకోకు గ్లోబల్ బ్రాండ్ హోదా..
- ▸ప్రతి కుటుంబంలో పారిశ్రామికవేత్త రావాలి
- ▸సీఎం చంద్రబాబు

పంట పండించడం వరకే కాదు.. దానికి విలువ జోడించి ప్రపంచ మార్కెట్‌లో అమ్మితేనే రైతు సంపద పెరుగుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. నూజివీడు పాప్‌కార్న్ నుంచి అరకు కాఫీ వరకు ఆంధ్రా ఉత్పత్తులను గ్లోబల్ బ్రాండ్లుగా తీర్చిదిద్దాలని, ఫుడ్ ప్రాసెసింగ్‌తో రైతులను పారిశ్రామికవేత్తలుగా మార్చాలని పిలుపునిచ్చారు.

## వైసీపీ మత మార్పిడులకు ప్రోత్సాహం

నూకరాజు కుటుంబం విషాదంపై సంచలన ఆరోపణలు.. సాధిక్ ఖాన్ వేధింపులపై తీవ్ర వ్యాఖ్యలు

విజయసాయిరెడ్డి

వైసీపీ ప్రభుత్వ హయాం నుంచే ఏపీలో మత మార్పిడులకు ప్రోత్సాహం మొదలైందని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఆరోపించారు. నూకరాజు కుటుంబ విషాదానికి సాధిక్ ఖాన్ వేధింపులు, బ్లాక్‌మెయిల్, మతమార్పిడి ఒత్తిడే కారణమని, మరిన్ని కుటుంబాలు బాధితులయ్యాయని వ్యాఖ్యానించారు.



వివరాలు 2వ పేజీలో

## విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్రం కీలక నిర్ణయం

- ◆నవంబర్ 17 నుంచి కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఉపసంహరణ..
- ◆మూడు నెలల గడువు... ◆భద్రత, అగ్నిమాపక విభాగాల బాధ్యతలు ఇక ఎవరికి?

CISF

వివరాలు 2వ పేజీలో

విశాఖ ఉక్కు కర్మాగారానికి 43 ఏళ్లుగా రక్షణగా ఉన్న కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం కవచం తొలగిపోనుంది. నవంబర్ 17 నుంచి బలగాలను పూర్తిగా ఉపసంహరించేందుకు కేంద్ర హోంశాఖ మూడు నెలల గడువు విధించినట్లు సమాచారం. దీంతో కర్మాగారం భద్రత, అగ్నిమాపక సేవలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఉత్కంఠ నెలకొంది. తాజాగా జరిగిన ప్రమాదం నేపథ్యంలో ఈ నిర్ణయం ఉద్యోగులు, కార్మిక వర్గాల్లో మరింత ఆందోళనకు కారణమవుతోంది.

## కుటుంబ వివాదాన్ని రాజకీయాలకు వాడుతున్నారు

- ○నా గొంతు నొక్కేందుకు తప్పుడు ప్రచారం..
- ○ఎన్ని కుట్రలు చేసినా వెనక్కి తగ్గను: జోగి రమేష్



02

కుటుంబ వివాదాన్ని రాజకీయ కక్ష సాధింపులో భాగంగా తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మాజీ మంత్రి జోగి రమేష్ ఆరోపించారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేక వ్యక్తిగత విషయాలను రోడ్డుపైకి తెస్తున్నారని మండిపడ్డ ఆయన.. చంద్రబాబు, లోకేష్ రాజకీయంగా తనపైకి రావాలని, కుటుంబ వ్యవహారాల్లోకి రావద్దని ఘాటుగా హెచ్చరించారు. తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, సరైన సమయంలో బయటపెడతానని స్పష్టం చేశారు.

## రేపు జగన్ అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ కీలక భేటీ

- ▸ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతం,
- ▸స్థానిక ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం



02

స్థానిక ఎన్నికల వేడి మొదలవుతున్న వేళ వైఎస్సార్‌సీపీలో రాజకీయ కదలికలు ఊపందుకోనున్నాయి. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం తాడేపల్లిలో జరగనున్న కీలక భేటీకి 175 నియోజకవర్గాల సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులు, ప్రాంతీయ సమన్వయకర్తలు హాజరుకానున్నారు. ప్రజా సమస్యలపై పోరాటం, పార్టీ పునర్‌నిర్మాణం, స్థానిక ఎన్నికల వ్యూహం, ఎస్ఐఆర్ ప్రక్రియపై చర్చించనున్న ఈ సమావేశం ద్వారా శ్రేణులకు జగన్ స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు.

## ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో కీలక పరిణామం

- ▸సాదిక్ ఖాన్‌కు 14 రోజుల న్యాయ రిమాండ్.
- ▸విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం

02

కాకినాడ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాన నిందితుడు సాదిక్ ఖాన్‌ను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా.. న్యాయస్థానం 14 రోజుల న్యాయ రిమాండ్ విధించింది.

# వైసీపీ మత మార్పిడులకు ప్రోత్సాహం: విజయసాయిరెడ్డి

మొదటి పేజీ తరువాయి

**రాజమహేంద్రవరం, (రక్షణ న్యూస్):**

పిఠాపురం పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతున్న వేళ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా మరింత వేడి పెంచాయి. వైసీపీ ప్రభుత్వ హయాం నుంచే రాష్ట్రంలో మత మార్పిడులను ప్రోత్సహించే పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన ఆరోపించారు. ఈ ఘటనను కేవలం కుటుంబ వివాదంగా చూడకుండా.. మతమార్పిడి ఒత్తిడి, బ్లాక్‌మెయిల్, వేధింపులు, ఆస్తుల బదలాయింపుల కోణంలోనూ లోతైన దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. నూకరాజు కుటుంబాన్ని విషాదానికి నెట్టిన ఘటనలో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న షేక్ సాధిక్ ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన విజయసాయిరెడ్డి.. సాధిక్ ఖాన్ నూకరాజు కుటుంబంపై తీవ్ర ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. ముఖ్యంగా నూకరాజు కుమార్తె సౌజన్యను మతం మార్చేందుకు ఒత్తిడి చేశారని, ఆమెను బ్లాక్‌మెయిల్ చేసి వేధించారని పేర్కొన్నారు. సౌజన్య రాసినట్లు ప్రచారంలో ఉన్న ఐదు పేజీల లేఖలోనూ బ్లాక్‌మెయిల్, భౌతిక వేధింపులు, మతమార్పిడి ఒత్తిడి, ఆస్తుల వ్యవహారాలపై ఆరోపణలు ఉన్నట్లు వార్తా కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ ఆరోపణలు దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉంది. సాధిక్ ఖాన్ వ్యవహారాన్ని విజయసాయిరెడ్డి 'లవ్ జిహాద్' తరహా ఘటనగా అభివర్ణించారు. హిందూ కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి చర్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. కాకినాడ, రాజమహేంద్రవరం ప్రాంతాల్లో మరికొన్ని కుటుంబాలు కూడా ఇలాంటి వేధింపులకు గురయ్యాయని ఆయన పేర్కొన్నప్పటికీ, ఈ ఆరోపణలకు సంబంధించిన పూర్తి అధికారిక వివరాలు ఇంకా వెలువడాల్సి ఉంది.

**రూ.కోట్ల ఆస్తులపై ఆరోపణలు....**నూకరాజు కుటుంబానికి చెందిన ఆస్తులు, బ్యాంకు లాకర్లు తదితరాలపైనా సాధిక్ కన్నేశాడని విజయసాయిరెడ్డి ఆరోపించారు. సుమారు రూ.2 కోట్ల విలువైన బంగారం, మరో రూ.2 కోట్ల నగదు, రావులపాలెంలో కోట్ల విలువైన భూమి, కాకినాడలోని స్థలం, ఇన్సూరెన్స్ క్లెయిమ్ సొమ్ము వంటి ఆస్తులపై వివాదం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే రూ.40 కోట్ల ఆస్తిని రాయించుకున్నారన్న ఆరోపణకు సంబంధించి అధికారిక దర్యాప్తు వివరాలు బయటకు రావాల్సి ఉంది. ఇదిలా ఉండగా.. సౌజన్య కుమారుడు, పదేళ్ల రియాన్ష్ కార్తికేయ రెడ్డి ఈ ఘటనలో ప్రాణాలతో బయటపడ్డాడు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన విజయసాయిరెడ్డి బాలుడి చదువు ఖర్చును భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ ఘటన నేపథ్యంలో సాధిక్ ఖాన్‌పై వచ్చిన ఆరోపణలు, మతమార్పిడి కోణం, ఆస్తుల వ్యవహారం, మరికొన్ని కుటుంబాలకు సంబంధించి చెబుతున్న అంశాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఒక కుటుంబాన్ని విషాదంలోకి నెట్టిన అసలు కారణాలు ఏమిటన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు మాత్రం ఈ వ్యవహారాన్ని రాష్ట్ర రాజకీయ చర్చలోకి తీసుకొచ్చాయి.

# రేపు జగన్ అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ కీలక భేటీ

మొదటి పేజీ తరువాయి

**తాడేపల్లి,రక్షణ న్యూస్**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం తాడేపల్లిలో జరగనుంది. ఉదయం 11 గంటలకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, ప్రజా సమస్యలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించనున్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులను సమాయత్తం చేయడం వంటి అంశాలపై జగన్ నాయకులకు దిశానిర్దేశం చేయనున్నారు.సమావేశానికి రీజినల్ కోఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, 175 అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, అనుబంధ విభాగాల బాధ్యులు, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శులు హాజరుకానున్నారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, ప్రజల్లో పార్టీకి ఉన్న స్పందన, నాయకులు--కార్యకర్తల మధ్య సమన్వయం వంటి అంశాలపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది.

**స్థానిక ఎన్నికలే ప్రధాన అంశం...**రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత ఈ సమావేశంలో కీలకంగా మారనుంది. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పార్టీ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేయడం, బలమైన అభ్యర్థుల ఎంపిక, స్థానిక సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై నాయకులకు జగన్ మార్గనిర్దేశం చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీకి క్షేత్రస్థాయిలో ఉన్న బలాన్ని అంచనా వేసి, బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక కార్యాచరణ రూపొందించడంపైనా చర్చ జరిగే అవకాశం ఉంది.

**ప్రజా సమస్యలపై పోరాట కార్యాచరణ...**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో నెలకొన్న ప్రజా సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకుని ప్రభుత్వాన్ని నిలదీసే విధంగా పార్టీ కార్యాచరణ రూపొందించడంపై కూడా సమావేశంలో చర్చించనున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వంటి అంశాలపై పార్టీ శ్రేణులకు స్పష్టమైన కార్యాచరణను సూచించే అవకాశం ఉంది.

**ఎస్ఐఆర్‌పైనా చర్చ...**తాజా రాజకీయ పరిణామాలతో పాటు ఎస్ఐఆర్ ప్రక్రియపై కూడా సమావేశంలో చర్చించనున్నారు. ఈ ప్రక్రియకు సంబంధించి పార్టీ నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించడం, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై జగన్ సూచనలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.మొత్తంగా రేపటి సమావేశం ద్వారా వైఎస్సార్‌సీపీ భవిష్యత్ రాజకీయ కార్యాచరణకు జగన్ దిశానిర్దేశం చేయనున్నారు. ముఖ్యంగా స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్ఠం చేయడం, ప్రజా సమస్యలపై మరింత దూకుడుగా పోరాటాలు నిర్వహించడం, నాయకులు--కార్యకర్తలను సమన్వయం చేయడంపై కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది.

# ఢిల్లీకి మళ్ళీ కాక్రోచ్ కదలిక..

మొదటి పేజీ తరువాయి

**న్యూఢిల్లీ: రక్షణ న్యూస్**

సామాజిక మాధ్యమాల్లో వ్యంగ్య ఉద్యమంగా మొదలై యువత సమస్యలపై దేశవ్యాప్త చర్చకు దారితీసిన కాక్‌రోచ్ జనతా పార్టీ సెప్టెంబర్ 5 నుంచి మరోసారి ఉద్యమబాట పట్టనుంది. కేంద్ర ప్రభుత్వం జూలై 25న యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ ఢిల్లీలో భారీ శాంతియుత నిరసన మార్చ్‌కు పిలుపునిచ్చింది. ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం వరకు ఈ మార్చ్ నిర్వహించనున్నట్లు పార్టీ జాతీయ వర్కింగ్ కమిటీ ప్రకటించింది. తమ పిల్లలను కోల్పోయిన నీట్ బాధిత కుటుంబాలు, పోలీసుల దౌర్జన్యానికి గురైన బాధిత కుటుంబాలు ఈ మార్చ్‌కు నాయకత్వం వహించనున్నట్లు తెలిపింది.

**హామీ ఇచ్చారు.. ఇప్పుడు అమలు చేయాలంటూ పట్టుబాటు...**జూలై 25న కేంద్ర ప్రభుత్వం యువతకు పలు హామీలు ఇచ్చిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్యమానికి కాక్‌రోచ్ జనతా పార్టీ తాత్కాలికంగా విరామం ఇచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన మాటను నమ్మి ఉద్యమాన్ని నిలిపివేశామని, అయితే గడువు గడుస్తున్నా హామీల అమలులో స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని సీజేపీ ఆరోపించింది. ఇచ్చిన హామీలపై లిఖితపూర్వక భరోసా కూడా ఇప్పటివరకు అందలేదని పేర్కొంది.'మా సహనాన్ని బలహీనతగా భావించకూడదు.. మా విశ్వాసాన్ని ప్రభుత్వం ద్రోహానికి అవకాశంగా మార్చుకోకూడదు' అంటూ కేంద్రానికి గట్టి హెచ్చరిక చేసింది. ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని స్పష్టం చేసింది.

**ఎఫ్ఐఆర్‌లపై సుప్రీంకోర్టు ఆదేశాల ప్రస్తావన...**దేశవ్యాప్తంగా యువత ఉద్యమాలకు సంబంధించి నమోదైన కేసుల అంశాన్ని కూడా కాక్‌రోచ్ జనతా పార్టీ ప్రధానంగా ప్రస్తావిస్తోంది. ఆగస్టు 18న సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా నమోదైన ఎఫ్ఐఆర్‌ల జాబితాను సమర్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరిందని సీజేపీ పేర్కొంది. అయితే దీనిపై కేంద్రం నుంచి స్పష్టమైన హామీ రాలేదని ఆరోపించింది.ఉద్యమ సమయంలో వివిధ ప్రాంతాల్లో కేసులు ఎదుర్కొన్న యువతకు న్యాయం చేయాలని, నిరసనల్లో పాల్గొన్న వారిపై నమోదైన కేసుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది. ఈ అంశాన్ని సెప్టెంబర్ 5న జరిగే మార్చ్‌లో ప్రధానంగా ప్రస్తావించనుంది.

**బాధిత కుటుంబాలే ముందుండి నడక//..**ఈసారి జరిగే మార్చ్‌కు మరో ప్రత్యేకత ఉంది. నీట్ సమస్యల కారణంగా తమ పిల్లలను కోల్పోయిన కుటుంబాలు, పోలీసుల చర్యల వల్ల నష్టపోయిన బాధిత కుటుంబాలు ముందుండి నడవనున్నాయి. వారి వెనుక జెన్-జెడ్ యువత, విద్యార్థులు, యువజన, విద్యార్థి సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సీజేపీ పిలుపునిచ్చింది.దీంతో సెప్టెంబర్ 5న జరిగే కార్యక్రమం కేవలం రాజకీయ నినాదాలతో కూడిన నిరసనగా కాకుండా బాధిత కుటుంబాల వేదన, యువత అసంతృప్తి, ప్రభుత్వ జవాబుదారీతనాన్ని ప్రశ్నించే వేదికగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది.

**పరీక్షల నుంచి పాఠశాలల వరకు.. అజెండా విస్తరణ...**కాక్‌రోచ్ జనతా పార్టీ ఉద్యమం మొదట పోటీ పరీక్షలు, నిరుద్యోగ సమస్యల చుట్టూనే సాగింది. ప్రశ్నపత్రాల లీకులు, పరీక్షల నిర్వహణలో లోపాలు, నియామకాల్లో జాప్యం వంటి అంశాలను ప్రధానంగా లేవనెత్తింది. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, భవనాల పరిస్థితి వంటి అంశాలను కూడా

**అజెండాలోకి తీసుకొస్తోంది...**ఇలా చూస్తే ఉద్యమం కేవలం ఉద్యోగాల కోసం పోరాటంగా కాకుండా విద్య నుంచి ఉపాధి వరకు యువత భవిష్యత్తుకు సంబంధించిన విస్తృత ఉద్యమంగా రూపుదిద్దుకుంటున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

**సామాజిక మాధ్యమాల నుంచి వీధుల్లోకి..**'కాక్‌రోచ్ జనతా పార్టీ' అనే పేరు మొదట వ్యంగ్యంగా పుట్టినా.. అదే పేరు ఇప్పుడు యువత నిరసనకు ప్రతీకగా మారింది. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన భారీ స్పందనను ఢిల్లీ వీధుల్లోని ప్రజా ఉద్యమంగా మార్చడమే ఇప్పుడు సీజేపీ ముందున్న అసలు సవాలు.సెప్టెంబర్ 5న జరిగే మార్చ్‌లో జెన్-జెడ్ యువత ఎంతమేరకు పాల్గొంటుంది? వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు ఢిల్లీకి తరలివస్తారా? బాధిత కుటుంబాల భాగస్వామ్యం ఉద్యమానికి ఎలాంటి బలం ఇస్తుంది? అన్నది ఆసక్తికరంగా మారింది.

**ఇది హెచ్చరికా.. మరో ఉద్యమానికి నాందియా?...**జూలైలో ప్రభుత్వంతో చర్చల తర్వాత ఉద్యమాన్ని నిలిపివేసిన సీజేపీ.. ఇప్పుడు మళ్లీ వీధుల్లోకి రావడం కేంద్రంపై ఒత్తిడి పెంచే వ్యూహంగా కనిపిస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఉద్యమాన్ని మరింత విస్తరిస్తామని స్పష్టం చేస్తోంది.తమ డిమాండ్ ఒక్కటేనని సీజేపీ చెబుతోంది---'ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి.' అదే నినాదంతో సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం వరకు యువత అడుగులు పడనున్నాయి.

సెప్టెంబర్ 5.. ఇండియా గేట్.

యువత మళ్లీ రోడ్డెక్కనుంది.

ఈసారి ప్రశ్న ఒక్కటే---హామీ ఇచ్చిన ప్రభుత్వం మాట నిలబెట్టుకుంటుందా? లేక మరోసారి ఉద్యమమే సమాధానం చెబుతుందా?

# ఫుడ్ ప్రాసెసింగ్‌తో రైతు ఆదాయానికి విలువ

మొదటి పేజీ తరువాయి

**నూజివీడు, ఆగస్టు 24 (రక్షణ న్యూస్):**

వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను కేవలం పంటలుగా కాకుండా విలువ జోడించిన ఉత్పత్తులుగా మార్చి అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న వ్యవసాయ ఉత్పత్తుల్లో కేవలం 10 శాతమే ప్రాసెసింగ్ చేస్తున్నామని, ఈ రంగాన్ని విస్తరిస్తే రైతులకు అధిక ఆదాయం, రాష్ట్రానికి భారీగా సంపద సమకూరుతుందని చెప్పారు. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలని ఆకాంక్షించారు.ఏలూరు జిల్లా ముసునూరు వద్ద సోమవారం ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి గార్మె పాప్‌కార్న్‌కా నాన్-జీఎంఓ హైబ్రీడ్ మెయిజ్ విత్తనాలను చంద్రబాబు ఆవిష్కరించారు. అనంతరం దేశంలోనే అతిపెద్ద నాన్-జీఎంఓ పాప్‌కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించి, బహిరంగ సభలో మాట్లాడారు. రైతులపై అభిమానంతో ఏలూరు జిల్లాకు వచ్చిన ఉపరాష్ట్రపతి దేశీయంగా రైతులతో కలిసి ఉత్పత్తి చేస్తున్న జన్యుమార్పిడి కాని విత్తనాలను ఆవిష్కరించడం సంతోషకరమన్నారు.నూజివీడు ప్రాంతంలో పండే పాప్‌కార్న్ దేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు విదేశాలకూ ఎగుమతి అవుతోందని చెప్పారు. 17,500 మంది రైతులు 40 వేల ఎకరాల్లో నాన్-జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్నను సాగు చేస్తున్నారని తెలిపారు. దేశ పాప్‌కార్న్ ఉత్పత్తిలో గార్మె సంస్థకు 70 శాతం వాటా ఉందని పేర్కొన్నారు. యాంత్రీకరణ, విత్తన సరఫరా, సాగు సాంకేతికత, రైతుల నుంచి కొనుగోలు వరకు మొత్తం వ్యవస్థీకృతంగా ఉండటం అభినందనీయమన్నారు.ఇప్పటి వరకు భారత్ పాప్‌కార్న్ కోసం బ్రెజిల్ సహా ఇతర దేశాలపై ఆధారపడిందని, ఇకపై దేశీయంగా ఉత్పత్తి చేసే పాప్‌కార్న్‌ను ఆసియా, ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేయాలని అన్నారు. ఆంధ్రా పాప్‌కార్న్, అరకు కాఫీని రైల్వే స్టేషన్లలో అందుబాటులోకి తీసుకురావడంతోపాటు కొండవీటి కొయ్యబొమ్మల వంటి స్వదేశీ ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్లకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.

**వ్యవసాయం నుంచి ఆర్థిక శక్తిగా..**కేంద్ర, రాష్ట్రాల్లోని ఎన్డీఏ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ఆర్థిక శక్తిగా, రైతులను పారిశ్రామికవేత్తలుగా చూస్తున్నాయని చంద్రబాబు తెలిపారు. పసుపు, మిరప, మొక్కజొన్న, ఆక్వా తదితర ఉత్పత్తులకు ప్రాసెసింగ్ చేసి మంచి బ్రాండ్‌తో అంతర్జాతీయ మార్కెట్ కల్పించాలని అన్నారు. ఉత్పత్తులకు విలువ జోడించినప్పుడే రైతులకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. యువత ఫుడ్ ప్రాసెసింగ్ రంగంపై దృష్టి సారించాలని సూచించారు.ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల సాగులోనూ మార్పులు రావాలని అన్నారు. నూజివీడు ప్రాంతంలో పామాయిల్, కోకో, ఆక్వా వంటి వాణిజ్య పంటలు పెరుగుతున్నాయని, వ్యవసాయం నుంచి ఉద్యాన పంటల వైపు రాష్ట్రం మారుతోందని చెప్పారు. వచ్చే 20-30 ఏళ్లలో ఏ పంటలు సాగు చేయాలి, ఎలాంటి ఆర్థిక వ్యవస్థ నిర్మించుకోవాలనే దానిపై ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.రాయలసీమను ఉద్యాన పంటల హబ్‌గా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ చేపట్టామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో రూ.లక్ష కోట్ల వ్యయంతో రాయలసీమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**36 సాగునీటి ప్రాజెక్టులకు రూ.35 వేల కోట్లు...**రాష్ట్రంలో రూ.35 వేల కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించి పంటలను కాపాడామని చెప్పారు. చింతలపూడి ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంత భవిష్యత్తు మారుతుందని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టును ఈ నెలాఖరులో ప్రారంభించి ప్రకాశం, నెల్లూరు, కడప ప్రాంతాలకు నీరు అందిస్తామని తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు పప్పుధాన్యాల వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ప్రతి ఎకరాకు నీరు అందించేలా నీటి భద్రత సాధించడమే లక్ష్యమన్నారు.దేశవ్యాప్తంగా నదుల అనుసంధానం ద్వారా నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలన్నది ఎన్డీఏ ప్రభుత్వ ఆలోచనగా పేర్కొన్నారు. గోదావరి-కృష్ణా, తుంగభద్ర, పెన్నా-కావేరీ నదులను అనుసంధానిస్తే నాలుగు రాష్ట్రాల్లో నీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. గంగా, మహానది, గోదావరి నదులను అనుసంధానిస్తే వేల టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోవచ్చని, నీటి భద్రత సాధిస్తే దేశ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్, కె.అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

**పాప్‌కార్న్ హైబ్రీడ్‌లతో రైతులకు మరింత ఆదాయం ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్...**

వ్యవసాయం దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభమని, రైతులు దేశానికి వెన్నెముక అని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. ముసునూరు వద్ద గౌర్మెట్ పాప్‌కార్న్‌కా నాన్-జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న విత్తనాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.దేశ జీడీపీలో వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా సుమారు 17 శాతమని తెలిపారు. వరి, గోధుమల తర్వాత మొక్కజొన్న దేశంలో మూడో ప్రధాన ఆహార పంటగా ఉందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే, కరవును తట్టుకునే పంట రకాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.భారత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పాప్‌కార్న్ హైబ్రీడ్ రకాలను అభివృద్ధి చేస్తున్న గౌర్మెట్ పాప్‌కార్న్‌కా సంస్థ కృషిని గవర్నర్ అభినందించారు. ఎనిమిది రాష్ట్రాల్లో 17,500 మంది రైతులతో కలిసి 39,500 ఎకరాలకు పైగా సాగు చేస్తున్న సంస్థ.. దేశవ్యాప్తంగా 3,400కు పైగా సినిమా హాళ్లకు ఉత్పత్తులను సరఫరా చేస్తోందని తెలిపారు.గతంలో పాప్‌కార్న్ విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంలో 70 శాతం అర్జెంటీనా, బ్రెజిల్ రైతులకు వెళ్లేదని, ప్రస్తుతం పరిస్థితి మారి 70 శాతం ఆదాయం భారతీయ రైతులకు దక్కుతోందన్నారు. తద్వారా 125 మిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతోందని చెప్పారు.శ్రీకాకుళం జిల్లాలో గిరిజన రైతులకు పాప్‌కార్న్ సాగును పరిచయం చేయడం అభినందనీయమన్నారు. గిరిజన రైతుల సహకారంతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన అరకు కాఫీ తరహాలో గౌర్మెట్ పాప్‌కార్న్‌కా కూడా ప్రపంచస్థాయి బ్రాండ్‌గా ఎదగాలని ఆకాంక్షించారు.

# విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్రం కీలక నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

**విశాఖపట్నం: రక్షణ న్యూస్**

విశాఖ ఉక్కు కర్మాగారం భద్రతా వ్యవస్థలో కీలక మార్పు చోటుచేసుకోనుంది. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ సంస్థ ఆధ్వర్యంలోని విశాఖ ఉక్కు కర్మాగారం నుంచి కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం సేవలను పూర్తిగా ఉపసంహరించేందుకు కేంద్ర హోంశాఖ ఆమోదం తెలిపినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. 2026 నవంబర్ 17 నుంచి కర్మాగారం నుంచి కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం బలగాలను పూర్తిగా వెనక్కి తీసుకునేలా మూడు నెలల గడువు ఇచ్చినట్లు సమాచారం.విశాఖ ఉక్కు కర్మాగారానికి కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం రక్షణ దాదాపు 43 ఏళ్లుగా కొనసాగుతోంది. 1983 ఆగస్టు నుంచి కర్మాగారంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళంతోపాటు అగ్నిమాపక విభాగం కూడా విధులు నిర్వహిస్తోంది. కర్మాగారం భద్రత, కీలక ఆస్తుల పరిరక్షణతోపాటు అగ్నిమాపక, సహాయక చర్యల్లోనూ ఈ బలగాలు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నాయి.

**దశలవారీగా తగ్గిన బలగాలుద...** గతంలో విశాఖ ఉక్కు కర్మాగారంలో సుమారు 1,500 మంది వరకు కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం సిబ్బంది విధులు నిర్వహించేవారు. 2024 తర్వాత దశలవారీగా బలగాల సంఖ్యను తగ్గిస్తూ వచ్చారు. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ సంస్థకు సంబంధించిన 2025 అధికారిక పత్రాల్లోనూ కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం బలగాల తగ్గింపు, ప్రత్యామ్నాయ భద్రతా ఏర్పాట్లపై చర్చ జరిగినట్లు స్పష్టమవుతోంది.2025 జనవరి నాటికి 438 మంది సిబ్బందిని తగ్గించడంతో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం బలం 596కు చేరిందని ఆ పత్రాల్లో పేర్కొన్నారు. అనంతరం మరింత తగ్గింపు ప్రతిపాదనలు కూడా జరిగాయి. తాజా నివేదికల ప్రకారం ప్రస్తుతం కర్మాగారంలో సుమారు 350 మంది భద్రతా సిబ్బంది, 120 మంది అగ్నిమాపక భద్రతా సిబ్బంది కొనసాగుతున్నట్లు సమాచారం. వీరినీ వెనక్కి తీసుకునే ప్రక్రియలో భాగంగానే నవంబర్ 17 గడువు విధించినట్లు తెలుస్తోంది.అయితే వివిధ దశల్లో బలగాల సంఖ్యపై భిన్న గణాంకాలు ప్రచురితమవుతున్నందున, ప్రస్తుతం కర్మాగారంలో ఎంతమంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారనే ఖచ్చితమైన వివరాలను రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ సంస్థ, కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

**బకాయిలు చెల్లించాలని ఆదేశం...**కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఉపసంహరణకు ముందు విశాఖ ఉక్కు కర్మాగారం యాజమాన్యం నుంచి తమకు రావాల్సిన అన్ని బకాయిలను వసూలు చేయాలని కేంద్ర హోంశాఖ సూచించినట్లు సమాచారం. ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం బకాయిలేమీ లేవన్న ధ్రువీకరణ పత్రంతోపాటు నిబంధనల అమలుపై నివేదికను సమర్పించే ప్రక్రియ ఉంటుందని నివేదికలు పేర్కొంటున్నాయి.

**భద్రత బాధ్యతలు ఎవరికి?...**కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం పూర్తిగా వెనక్కి వెళ్లిన తర్వాత కర్మాగారానికి ప్రత్యామ్నాయ భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. గతంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం సిబ్బందిని తగ్గించిన సందర్భాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పోలీసు బలగాలను వినియోగించినట్లు నివేదికలు చెబుతున్నాయి.అయితే ఈసారి కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం స్థానంలో ఎవరు కర్మాగారం భద్రత, అగ్నిమాపక సేవల బాధ్యతలు చేపడతారనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. భారీ పారిశ్రామిక సంస్థ కావడంతో భద్రతా వ్యవస్థలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని ఉద్యోగులు, కార్మిక సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.ఇదే సమయంలో కర్మాగారంలో భద్రత అంశం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. జూన్ 8న స్టీల్ మెల్ట్ షాప్-1లో జరిగిన పేలుడు ఘటనలో ఎనిమిది మంది మృతి చెందగా, మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటనపై రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ సంస్థతోపాటు కేంద్ర స్థాయిలోనూ విచారణ జరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో భద్రతా బలగాల ఉపసంహరణ నిర్ణయం ఉద్యోగులు, కార్మిక వర్గాల్లో ఆందోళనకు కారణమవుతోంది.

**ప్రైవేటీకరణతో సంబంధముందా?...**కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఉపసంహరణ నేపథ్యంలో విశాఖ ఉక్కు కర్మాగారం భవిష్యత్తుపై కార్మిక సంఘాలు, ఉద్యోగుల్లో చర్చ మొదలైంది. కర్మాగారం ప్రైవేటీకరణ అంశం ఇప్పటికే రాజకీయంగా, కార్మిక వర్గాల్లో అత్యంత సున్నితమైన అంశంగా ఉన్న నేపథ్యంలో తాజా నిర్ణయంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అయితే కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఉపసంహరణను ప్రైవేటీకరణతో ముడిపెడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి కారణాన్ని ప్రకటించినట్లు తాజా నివేదికల్లో లేదు. అందువల్ల దీనిని ప్రైవేటీకరణకు సంకేతంగా ఇప్పుడే నిర్ధారించడం కంటే, కర్మాగారం భద్రతా వ్యవస్థలో మార్పుగా మాత్రమే చూడాల్సి ఉంటుంది.మొత్తంగా చూస్తే.. 43 ఏళ్లుగా విశాఖ ఉక్కు కర్మాగారానికి రక్షణగా ఉన్న కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం కవచం నవంబర్ 17తో పూర్తిగా తొలగిపోనుంది. ఇక కర్మాగారంలో భద్రత, అగ్నిమాపక సేవలకు ఎలాంటి ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటు చేస్తారన్నదే ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది.

26-5-26 rakshana main_Layout 1 8/25/2026 5:26 AM Page 3



# ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో కీలక పరిణామం

మొదటి పేజీ తరువాయి

**కాకినాడ, రక్షణ న్యూస్**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పంచాయతీరాజ్ సహాయ ఇంజినీర్ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసులో ప్రధాన నిందితుడిగా పోలీసులు పేర్కొంటున్న షేక్ సాదిక్ ఖాన్‌ను సోమవారం న్యాయస్థానంలో హాజరుపరచగా.. కోర్టు 14 రోజుల న్యాయ రిమాండ్ విధించింది. దీంతో సాదిక్ ఖాన్‌ను పోలీసులు జైలుకు తరలించారు. ఆగస్టు 16న నూకరాజు, ఆయన భార్య, కుమార్తె రాజమహేంద్రవరం సమీపంలోని గోదావరిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. వారి వెంట ఉన్న చిన్నారి ప్రాణాలతో బయటపడగా.. కుటుంబంలోని ముగ్గురు మృతి చెందారు. ఘటన అనంతరం లభించిన లేఖల్లో సాదిక్ ఖాన్ వేధింపుల ప్రస్తావన ఉండటంతో పోలీసులు అతడిని కేసులో ప్రధాన నిందితుడిగా దర్యాప్తు చేస్తున్నారు

**మీరట్‌లో పట్టుబడిన సాదిక్/...** ఘటన అనంతరం సాదిక్ ఖాన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతడి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. పది మంది ఎస్‌ఐలు సహా సుమారు 40 మంది పోలీసులతో కూడిన ఎనిమిది ప్రత్యేక బృందాలు వివిధ ప్రాంతాల్లో నిందితుడి కోసం గాలించాయి. చివరకు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం కట్టుదిట్టమైన భద్రత మధ్య కాకినాడకు తరలించారు.

**ప్రత్యేక బృందంతో విచారణ...**సాదిక్ ఖాన్‌ను సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక దర్యాప్తు బృందం సుదీర్ఘంగా విచారించింది. ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులు, బాధిత కుటుంబంతో అతడికి ఉన్న సంబంధాలు, లేఖల్లో చేసిన ఆరోపణలు తదితర అంశాలపై పోలీసులు ప్రశ్నించినట్లు సమాచారం. విచారణ అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి న్యాయస్థానంలో హాజరుపరిచారు. కాకినాడ ఎస్పీ బిందుమాధవ్ ప్రకారం.. నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు సాదిక్ ఖాన్ వేధింపులే కారణమన్న ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోంది. నూకరాజు, ఆయన కుమార్తె సౌజన్య రాసిన లేఖలు కేసులో కీలక ఆధారాలుగా ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు. అయితే దర్యాప్తు పూర్తయ్యే వరకు లేఖల్లోని ఆరోపణలను తుది నిర్ధారణగా పరిగణించలేమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**కస్టడీకి తీసుకునే అవకాశం...**నిందితుడిని మరింతగా విచారించేందుకు పోలీసులు మంగళవారం కస్టడీ పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు. కస్టడీ విచారణలో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. సాదిక్ ఖాన్ నిర్వహిస్తున్న షూటింగ్ అకాడమీ వ్యవహారాలపైనా పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని పోలీసులు తెలిపారు. ఈ కేసు నేపథ్యంలో రాజకీయంగానూ తీవ్ర చర్చ జరుగుతోంది. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి సాదిక్ ఖాన్‌పై పలు తీవ్ర ఆరోపణలు చేశారు. అయితే ఆయన చేసిన రాజకీయ ఆరోపణలు దర్యాప్తులో ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది.

లిప్రస్తుతం సాదిక్ ఖాన్ రిమాండ్‌కు వెళ్లడంతో కేసు దర్యాప్తు కీలక దశలోకి ప్రవేశించింది. కస్టడీ విచారణలో ఏ అంశాలు బయటపడతాయి? నూకరాజు కుటుంబాన్ని ఆత్మహత్యకు దారితీసిన పూర్తి పరిణామాలు ఏమిటి? అన్నది పోలీసుల తదుపరి దర్యాప్తుతో తేలనుంది.లి

## తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

**తిరుమల,ఆగస్ట్24():** తిరుమలలో రద్దీ కొనసాగుతోంది. మరోవైపు శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని పవిత్ర మండపంలోని యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుంగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు పంచసూక్తాలను పఠించారు. ఆ తర్వాత పవిత్ర ప్రతిష్ట జరిగింది. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు విశేష సమర్పణ చేశారు. అనంతరం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో



సి.హెచ్.వెంకయ్య చౌదరి, టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కుటుంబ వివాదాన్ని రాజకీయాలకు వాడుతున్నారు

మొదటి పేజీ తరువాయి

**విజయవాడ: రక్షణ న్యూస్**

తన కుమారుడు రాజీవ్, కోడలు మేఘన మధ్య నెలకొన్న కుటుంబ వివాదాన్ని రాజకీయంగా వాడుకుంటూ తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ ఆరోపించారు. నెల రోజులుగా తన కుటుంబం తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేక కుటుంబ వ్యవహారాలను తెరపైకి తీసుకొస్తున్నారని మండిపడ్డారు. రాజీవ్‌కు మేఘనతో వివాహం తానే ఘనంగా జరిపించానని, కోడలిని కన్నకూతురిలా చూసుకున్నామని జోగి రమేష్ తెలిపారు. వివాహం తర్వాత భార్యాభర్తల మధ్య అభిప్రాయ భేదాలు వచ్చాయని, వారు కలిసి ఉండాలని తల్లిదండ్రులుగా తాము ఎంతగానో ప్రయత్నించామని చెప్పారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో రాజీవ్ విడాకుల కోసం కోర్టును ఆశ్రయించాడని వెల్లడించారు. జూన్ 8న రాజీవ్ విడాకుల పిటిషన్ దాఖలు చేయగా, జూలై 24న మేఘన తమ కుటుంబంపై పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిపారు. విడాకుల అంశం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉన్నందున దానిపై ఎక్కువగా మాట్లాడదలుచుకోలేదన్నారు.

**'నా కుటుంబాన్ని రాజకీయంగా టార్గెట్ చేస్తున్నారు'..**కుటుంబ వివాదాన్ని అడ్డుపెట్టుకుని తనను రాజకీయంగా దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారని జోగి రమేష్ ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. తనను రాజకీయంగా ఎదుర్కోవాలంటే రాజకీయంగానే రావాలని, వ్యక్తిగత విషయాల్లోకి రావద్దని సూచించారు. తన కుటుంబంపై నకిలీ వీడియోలు, ఆడియోలు, కృత్రిమ మేధస్సుతో రూపొందించిన ప్రచారాలను సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తనను రాజకీయంగా అడ్డుకునేందుకే ఈ వ్యవహారాన్ని పెద్దది చేస్తున్నారని మండిపడ్డారు. తన వద్ద ఈ వ్యవహారానికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయని, సరైన సమయంలో వాటిని బయటపెడతానని చెప్పారు.

**మతపరమైన ఆరోపణలపైనా స్పందన/...**తన భార్య మతపరమైన అంశాలపై జరుగుతున్న ప్రచారాన్ని కూడా జోగి రమేష్ ఖండించారు. తన భార్య బైబిల్ చదవడం, ఏసుక్రీస్తు బోధనలు వినడం తప్పా? అని ప్రశ్నించారు. తమ కుటుంబం అన్ని మతాలను గౌరవిస్తుందని, తిరుమల, విజయవాడ దుర్గమ్మ ఆలయాలకు వెళ్తామని, యాగాలు, యజ్ఞాల్లోనూ పాల్గొంటామని చెప్పారు. ఒక మతానికి సంబంధించిన విషయాలను చదవడం లేదా వినడాన్ని తప్పుగా చిత్రీకరించడం సరికాదన్నారు.

**వసంత కృష్ణప్రసాద్‌పై ఆరోపణలు...**ఈ వ్యవహారంలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ జోక్యం ఉందని జోగి రమేష్ ఆరోపించారు. తన కోడలు ఆయన కార్యాలయానికి వెళ్లినట్లు పేర్కొంటూ ఓ వీడియోను కూడా విడుదల చేశారు. వ్యక్తిగత జీవితంపై తాను ఎప్పుడూ వసంత కృష్ణప్రసాద్‌తో మాట్లాడలేదని, రాజకీయంగా ఎదుర్కోవాలంటే రాజకీయంగానే ఎదుర్కొంటానని అన్నారు. వ్యక్తిగత అంశాలను రాజకీయాల్లోకి తీసుకురావడం సరికాదని వ్యాఖ్యానించారు

**'ఎన్ని ఇబ్బందులు పెట్టినా వెనక్కి తగ్గను'....**తనను, తన కుటుంబాన్ని ఎన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేసినా తాను వెనక్కి తగ్గబోనని జోగి రమేష్ స్పష్టం చేశారు. గతంలోనూ తనపై కేసులు, అరెస్టులు జరిగాయని గుర్తుచేశారు. ప్రస్తుతం కూడా తన గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని, అయినప్పటికీ ప్రజా సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని చెప్పారు. రాజకీయ పోరాటాన్ని రాజకీయంగానే చేయాలని, కుటుంబాలను లక్ష్యంగా చేసుకోవద్దని చంద్రబాబు, లోకేష్‌కు సూచించారు.

# భారీ స్కోర్ వద్ద భారత్ డిక్లేర్డ్!

## ధ్రువ్ జురెల్ అజేయ శతకం

శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా భారీ స్కోర్ చేసింది. ధ్రువ్ జురెల్(177 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 115 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 503/9 భారీ స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసింది. రిషభ్ పంత్(89 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 63) హాఫ్ సెంచరీతో రాణించాడు. తొలి రోజు ఆటలో దేవదత్ పడిక్కల్(193 బంతుల్లో 12 ఫోర్లతో 117) సెంచరీతో చెలరేగగా.. శుభ్‌మన్ గిల్(108 బంతుల్లో 6 ఫోర్లతో 50) హాఫ్ సెంచరీతో రాణించిన సంగతి తెలిసిందే. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో(4/106) నాలుగు వికెట్లు తీయగా..ప్రభాత్ జయసూర్య కేశర నువాంత్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. లాహిరు కుమారాకు ఒక వికెట్ దక్కింది. అనంతరం శ్రీలంక బ్యాటింగ్‌కు దిగగా 2 బంతులు పడగానే వర్షం అంతరాయం కలిగించింది. ఆ తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా.. శ్రీలంక 3 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 8 పరుగులు చేసింది. లాహిరు ఉడారా(1) ప్రసిధ్ కృష్ణ ఔట్ చేయగా.. ప్రభాత్ జయసూర్య(2)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. వర్షం కారణంగా రెండో రోజు 56 ఓవర్ల ఆటనే సాధ్యమైంది. 300/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓవర్‌నైట్ బ్యాటర్ సారాన్ష్ జైన్(6) రెండు పరుగులు మాత్రమే చేసి అసితా ఫెర్నాండో బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. దాంతో తొలి రోజు ఆటలో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన రిషభ్ పంత్ మళ్లీ బ్యాటింగ్‌కు దిగాడు. ధ్రువ్ జురెల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. తనదైన శైలిలో చెలరేగిన ఈ జోడీ వేగంగా పరుగులు రాబట్టింది. ముఖ్యంగా పంత్ భారీ షాట్లతో లంకబౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో పంత్ 81 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకోగా.. ధ్రువ్ జురెల్ 97 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. దాంతో భారత్ 419/6 స్కోర్ వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో పంత్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. అయితే అతన్ని కుశార నువాంత క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో ఏడో వికెట్‌కు నమోదైన 112 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి మానవ్ సుతార్ రాగా.. ధ్రువ్ జురెల్ తన జోరును కొనసాగించాడు. ఆచితూచిన ఆడిన మానవ్ సుతార్(18)ను ప్రబాత్ జయసూర్య కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చగా..




సిరాజ్‌తో కలిసి ధ్రువ్ జురెల్ రెండో సెషన్‌ను ముగించాడు. వర్షం కారణంగా కాస్త ముందుగానే ఈ సెషన్ ముగిసింది. ఆఖరి సెషన్‌లో దూకుడుగా ఆడిన ధ్రువ్ జురెల్ 171 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఆ వెంటనే భారీ సిక్సర్‌తో ధ్రువ్ జురెల్ తన జోరు కనబర్చగా.. సిరాజ్(3) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. దూకుడుగా ఆడిన ధ్రువ్ జురెల్ వేగంగా పరుగులు రాబట్టి జట్టు స్కోర్‌ను 500 ధాటించాడు. ఆ వెంటనే భారత్ తమ ఇన్నింగ్స్‌ను డిక్లెర్డ్ చేసింది.

## పంత్ సరికొత్త చరిత్ర..

భారత స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మరో అరుదైన చారిత్రాత్మక రికార్డును సాధించాడు. విదేశాల్లో లేదా న్యూట్రల్ వేదికల్లో జరిగిన టెస్టుల్లో భారత వికెట్ కీపర్‌గా అత్యధిక పరుగులు సాధించిన లెజెండరీ క్రికెటర్ ఎంఎస్ ధోనీ పేరిట ఉన్న ఆల్ టైమ్ రికార్డును పంత్ బ్రేక్ చేశాడు. కొలంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్ట్ రెండో రోజు ఆటలో పంత్ ఈ ఘనతను నమోదు చేశాడు. ఈ విభాగంలో 2500 పరుగుల మార్కును దాటిన పంత్, ధోనీ సాధించిన 2496 పరుగుల రికార్డును అధిగమించి అగ్రస్థానంలో నిలిచాడు. ధోనీ 32.84 సగటుతో ఆ పరుగులు చేయగా, పంత్ దాదాపు 42 సగటుతో ఈ మైలురాయిని అందుకోవడం గమనార్హం. ఈ లిస్టులో ఫరూక్ ఇంజనీర్ (1209 రన్స్), సయ్యద్ కిర్మాణి (1109 రన్స్), కిరణ్ మోరే (901 రన్స్) తర్వాతి స్థానాల్లో నిలిచారు.. ఈ రికార్డు నమోదు కావడానికి ఒక రోజు ముందు పంత్ మైదానంలో తీవ్ర గాయానికి లోనయ్యాడు. మొదటి రోజు ఆట మూడో సెషన్‌లో శ్రీలంక పేసర్ లహిరు కుమార వేసిన షార్ట్ పిచ్ బంతిని పుల్ చేసే క్రమంలో పంత్ ఎడమ చేతి మణికట్టుకు గాయం అయింది. నొప్పితో విలవిల్లాడిన పంత్ కు భారత జట్టు ఫిజియో ఐస్ ప్యాక్ పెట్టి కట్టు కట్టినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ తీవ్ర అసౌకర్యంగా అనిపించడంతో 15 బంతుల్లో 3 పరుగులు చేసిన తర్వాత 58వ ఓవర్లో పంత్ రిటైర్డ్ హర్ట్ గా వెనుదిరిగాడు. గాయం తీవ్రత భయపెట్టినప్పటికీ, రెండో రోజు ఉదయం భారత్ ఆరో వికెట్ కోల్పోయిన తర్వాత పంత్ తిరిగి బ్యాటింగ్ కు వచ్చాడు. అసిథ ఫెర్నాండో, ఇతర లంక పేసర్లు వరుసగా బౌన్సర్లతో దాడి చేస్తూ అతడి భుజానికి కూడా బంతులు తాకించినా పంత్ ఏమాత్రం లెక్క చేయలేదు. నొప్పిని భరిస్తూనే మరో వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ తో కలిసి జట్టు ఇన్నింగ్స్ ను ముందుకు నడిపించాడు. ఇద్దరూ కలిసి సమయోచిత భాగస్వామ్యంతో లంక బౌలర్లను దీటుగా ఎదుర్కొని స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లారు. శ్రీలంక బౌలర్లు తీవ్రంగా ఒత్తిడి తెస్తున్న సమయంలో పంత్ చూపిన అంకితభావం జట్టుకు కొండంత బలాన్ని ఇచ్చిందనడంలో సందేహం లేదు. ఇక వీళ్లిద్దరూ సాధికారికంగా బ్యాటింగ్ చేస్తూ, అబేధ్యమైన ఏడో వికెట్ కు 112 పరుగులు జోడించారు. లంచ్ విరామ సమయానికి టీమిండియా 112 ఓవర్లలో 6 వికెట్లకు 419 పరుగులు చేసింది. పంత్ (63 బ్యాటింగ్)తో పాటు జురేల్ (59 బ్యాటింగ్) అర్థ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. ఫెర్నాండోకు నాలుగు వికెట్లు దక్కాయి. ఇప్పటికే గాలే టెస్ట్ లో భారత్ 165 రన్స్ తో గెలిచి సిరీస్ లో 1-0 లీడ్ లో ఉండగా, కొలంబోలోనూ పంత్ పోరాటంతో జట్టు పటిష్ట స్థితికి చేరింది.

## దేవదత్ పడిక్కల్ వరుస సెంచరీలు

శ్రీలంక పర్యటనలో భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అదరగొడుతున్నాడు. ఇటీవల గాలె వేదికగా జరిగిన తొలి మ్యాచ్?లో రెండు ఇన్నింగ్స్?ల్లో (167, 44) రాణించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్?గా నిలిచాడు. తాజాగా కొలంబో టెస్టులోనూ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ, మరో సెంచరీ నమోదు చేశాడు. అదివారం ప్రారంభమైన రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్?లో పడిక్కల్ 117 పరుగులతో రాణించాడు. దీంతో ప్రస్తుతం అందరి కళ్లు పడిక్కల్?పై పడ్డాయి. ఛతేశ్వర్ పుజారా తర్వాత టెస్టుల్లో భారత్?కు నెం 3 స్థానాన్ని భర్తీ చేయడం సవాల్?గా మారింది. టెస్టుల్లో కీలకమైన ఈ వన్?డౌన్?లో పలువురు బ్యాటర్లను పరీక్షించి చూసింది. అయితే గతేడాది సాయి సుదర్శన్ సుదీర్ఘ ఫార్మాట్?లో అరంగేట్రం చేయడంతో అతడే ఆ ప్లేస్?లో బ్యాటింగ్? చేస్తున్నాడు. అప్పట్నుంచి నెం 3 స్థానానికి మేనేజ్?మెంట్ కూడా సుదర్శన్ పేరునే పరిశీలిస్తుంది. ఈ లంక పర్యటనలో కూడా మొదట సుదర్శన్?నే ఎంపిక చేసింది. అయితే అతడు గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో ఆ ఛాన్స్ పడిక్కల్?కు వచ్చింది. అలా వచ్చిన అవకాశాన్ని పడిక్కల్ పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్నాడు. ప్రత్యర్థి బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని పరుగులు సాధిస్తున్నాడు. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్?లో ఏకంగా 167 పరుగుల భారీ ఇన్నింగ్స్?తో ఆకట్టుకున్నాడు. నంబర్ 3 స్థానంలో కొంతకాలంగా ఫాస్ట్, స్పిన్ బౌలింగ్ రెండింటినీ సమర్థవంతంగా ఎదుర్కొనే టెస్టు బ్యాటర్ కోసం మేనేజ్?మెంట్ అన్వేషిస్తోంది.





Publisher & Printer: G. Narendra, C.G. Palem, Bapatla, Bapatla District